సాక్షి రంగారెడ్డి

గురువారం । 24 । ఆగస్టు । 2023



ఎండుతున్న పంటలు

వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఎండిపోతున్నాయి. 10లో▸



కేశంపేటలో ఒడిశా బృందం

ఒడిశాకు చెందిన ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కేశంపేటను సందర్శించారు. 10లో▸



కులవృత్తులను ప్రోత్సహిస్తాం

బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. 10లో▸



ఇబ్రహీంపట్నం: చంద్రయాన్ విజయంతో జాతీయ జెండాలతో సంబరాలు

చంద్రయాన్–3

సంబురాలు అదిరెన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో జిల్లా వాసులు సంబురాలు జరుపుకొన్నారు. లాండర్ దిగే ఉద్విగ్న క్షణాలను టీవీలైవ్ ప్రసారాలు, ఇస్రో వెబ్‌సైట్, యూ ట్యూబ్ ద్వారా ఆసక్తిగా వీక్షించారు. మిధాని, డీఆర్‌డీఓ సహా పలు పరిశోధన సంస్థల్లో పని చేస్తున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులే కాకుండా విద్యార్థులు, సాధారణ ప్రజలు విజయోత్సవాల్లో మునిగితేలారు. అఖండ విజయంతో అంతరిక్షంలో చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. శంషాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నేతలు నిర్వహించిన విజయోత్సవాల్లో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీవీ స్క్రీన్‌లు ఆన్ చేసి పిల్లలకు చంద్రయాన్ సాధించిన విజయాన్ని చూపించారు.



చేవెళ్ల: జాతీయ పతాకాలతో స్థానికుల వేడుకలు

న్యూస్‌రీల్

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ వికారాబాద్ కళాశాలలో సీట్ల భర్తీ కోసం గురు, శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిజికల్ సైన్స్ (బీఎస్‌ఈ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్), బీకామ్ (బీఏ), బీకాం (సీఏ), బీఏ (హెచ్‌ఈపీ) లైఫ్ సైన్స్ (బీఎస్‌ఈ, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ) గ్రూప్‌ల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న కళాశాలలో ఉదయం 9.30 నుంచి హాజరుకావాలన్నారు. విద్యార్థినులు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మార్క్‌ల మెమోలు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, 5–10వ తరగతి బోనఫైడ్, ఆధార్, టీసీ, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

ట్రస్టు భూములను కాపాడండి

కలెక్టర్‌కు అఖిలపక్షం నేతల వినతి



కలెక్టర్ హరీశ్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్షం నేతలు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ రెవెన్యూ శివారులోని వెంకట్‌రావు మెమోరియల్ ట్రస్టు భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బుధవారం అఖిలపక్షం నేతలు కలెక్టర్ హరీశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 44వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకొని వందల కోట్ల విలువ చేసే సుమారు 102 ఎకరాల భూమిని కొంత మంది కాజేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా గత నెల 35 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ సైతం చేశారని తెలిపారు. విలువైన భూమిని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, సీపీఐ నాయకుడు పానుగంటి పర్వతాలు, సీఐటీయూ నాయకుడు రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు, ఎంపీటీసీలు చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల చేవెళ్ల పాఠశాల, కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు పోస్టులు ఖాళీ ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఆసక్తి గల వారు తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 24న తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. పీజీ, బీఈడీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 79950 10635 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టికెట్ ఫ్లీజ్..

- కాంగ్రెస్‌లో ఆశావహుల పోటీ
- గాంధీభవన్‌కు క్యూ కడుతున్న నేతలు
- మహేశ్వరం నుంచి చల్లా, కొత్త, ఏనుగు జంగారెడ్డి దరఖాస్తు
- ఇబ్రహీంపట్నం నుంచి దండెం
- పార్టీ శ్రేణుల్లో సందడి వాతావరణం





మహేశ్వరం నుంచి టికెట్ కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించడంతో కాంగ్రెస్‌లో సందడి మొదలైంది. వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం పోటీపడుతున్నారు. గాంధీభవన్‌కు జిల్లా కాంగ్రెస్ నేతలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో గ్రూపులుగా విడిపోయిన నేతలు.. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పార్టీ ఆఫీసుకు చేరుకుంటున్నారు. గాంధీభవన్ పెద్దల ముందు తమ అంగబలం, అర్థబలం చాటుకునేందుకు యత్నిస్తున్నారు. బ్యాండ్ మేళాలు.. డప్పు చప్పుళ్లు.. గిరిజన నృత్యాలు, తెలంగాణ సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శిస్తూ బలప్రదర్శనకు దిగుతున్నారు. బాణసంచా పేల్చుతూ హడావుడి చేస్తున్నారు.

ఏ నియోజకవర్గం నుంచి ఎవరంటే?

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలై ఇప్పటికే ఆరు రోజులైంది. మరో రెండు రోజుల్లో అప్లికేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకు జిల్లాలో సీనియర్ లీడర్లు తమ దరఖాస్తులను గాంధీ భవన్‌కు పంపలేదు. ఇదిలా ఉంటే మహేశ్వరం నియోజకవర్గం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన కొత్త మనోహర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇబ్రహీంపట్నం నుంచి దండెం రామిరెడ్డి సహా శివకుమార్ దంపతులు దరఖాస్తు చేశారు. ఇక రాజేంద్రనగర్ నుంచి జ్ఞానేశ్వర్, షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకర్ దరఖాస్తు చేసుకున్నారు. చేవెళ్ల, కల్వకుర్తి, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియో జకవర్గాల నుంచి ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం విశేషం.

పోటీకి ఇతరులు కూడా

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు పార్టీ నేతలే కాదు.. ఇతర ఆశావహులు కూడా పోటీపడుతున్నారు. స్వయంగా గాంధీ భవన్‌కు చేరుకుని అప్లికేషన్ల కోసం ఆరా తీస్తున్నారు. వీరిలో రిటైర్డ్ ఉద్యోగులు, యువతీయువకులే కాకుండా ఇతర పార్టీ నేతలు కూడా ఉండటం విశేషం. దరఖాస్తు ఫీజు జనరల్/బీసీ కేటగిరీ అభ్యర్థికి రూ.50 వేలు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థికి రూ.25 వేలుగా నిర్ణయించారు. గురు, శుక్రవారాల్లో దరఖాస్తుల సమర్పణ కోసం పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు తరలివచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.



ఇబ్రహీంపట్నం నుంచి దరఖాస్తు చేసుకుంటున్న దండెం రామిరెడ్డి



మహేశ్వరం నుంచి దరఖాస్తు చేసుకుంటున్న ఏనుగు జంగారెడ్డి

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం



విద్యార్థులతో కలిసి చంద్రయాన్–3 ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న సుశీందర్ రావు

- జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు

మహేశ్వరం: ప్రపంచంలో అగ్రదేశాల సరసన నిలబెట్టి దేశ కీర్తిని చాటిన ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులతో కలిసి బుధవారం చంద్రయాన్–3 ల్యాండింగ్ ప్రోగ్రాంను కంప్యూటర్, డిజిటల్ ల్యాబ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్రో శాస్త్రవేత్తలు భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. భవిష్యత్తులో గొప్ప ప్రయోగాలకు ఇదొక మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలు కావాలని పిలుపునిచ్చారు. చంద్రయాన్ విజయవంతంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలు చేతబట్టి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మేకగూడ సర్పంచ్ విధుల నుంచి తొలగింపు

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ సర్పంచ్ పాండురంగా రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ బాల్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సంజాయిషీ కోరుతూ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా సర్పంచ్ నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ శర్మ

కడ్తాల్: పాఠశాల నుంచే పర్యావరణ పరిరక్షణ ప్రస్థానం జరగాలని, చిన్నారులు భావి ప్రపంచానికి మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (విద్యుత్ శాఖ) సునీల్ శర్మ పిలుపునిచ్చారు. అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో బుధవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఎర్త్ క్లబ్–యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమానికి నాందిగా జిల్లాతో పాటు, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించిన సైన్స్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రెండురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సునీల్ శర్మ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు వారధులు కావాలని, విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎర్త్ క్లబ్– యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ నాయకత్వాన్ని పెంపొందించడానికి సీజీఆర్ సంస్థ నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. పలువురు విద్యావేత్తలు, పర్యావరణ నిపుణులు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీజీఆర్ ప్రతినిధులు, శాస్త్రవేత్తలతో కలిసి పాఠశాల ఎర్త్ క్లబ్– యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త మన్మథరెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్ర, సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, పాలసీ నిపుణుడు దొంతి నర్సింహరెడ్డి, శాస్త్రవేత్తలు సాయి భాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, గాయకులు లెనిన్‌బాబు, విద్యావేత్త రజనీకాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్, వివిధ జిల్లాల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘రియల్’ పేరిట ఘరానా మోసం!

- తక్కువ పెట్టుబడితో రెట్టింపు లాభాలంటూ ఎర
- ఏజెంట్లకు 30శాతం కమీషన్ ఇచ్చేలా ఒప్పందం
- 144మంది నుంచి రూ.4.50కోట్లు వసూలు
- బాధితుల ఫిర్యాదుతో ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.1.36 కోట్లు స్వాధీనం

నల్లగొండ క్రైం: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలంటూ ఘరానా మోసానికి పాల్పడిన ఓ ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.36 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సాగర్‌రోడ్డులో గల ఓంకార్ నగర్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ బ్రోకర్, ఫిలిమ్ ప్రొడ్యూసర్‌గా పని చేసే మామిళ్ల గిరి ప్రసాద్, నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం బట్లపల్లి గ్రామానికి చెందిన మాదగోని వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్ గ్రామానికి చెందిన బర్ల శేఖర్‌యాదవ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరు ఓ ముఠాగా ఏర్పడి అందమైన బ్రోచర్లను తయారు చేయించి, కాగితాలపై ఎకరాల కొద్దీ ఉన్నట్లు వెంచర్ల ఫొటోలతో పాటు కార్పొరేట్‌స్థాయిలో కార్యాలయం ఏర్పాటు చేయించారు. సింగిల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టండి.. ఏడాదిలోనే రెట్టింపు ఆదాయం లభిస్తుందంటూ ప్రచారం చేశారు.

రూ.10లక్షలు పెడితే ఏడాదికి రూ.20లక్షలు అంటూ..

ప్లాట్ల కొనుగోలుకు మధ్యవర్తిగా తీసుకొచ్చే ఏజెంట్లకు 30శాతం కమీషన్ ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. గిరిప్రసాద్ స్నేహితుడైన బైరమాల్‌గూడ పిండి నారాయణరెడ్డి కాలనీకి చెందిన బొడ్డు వెంకటేశ్ ద్వారా కొన్ని ప్లాట్లు విక్రయించారు. ఏడాది క్రితం వీరు బైరమాల్‌గూడలో గోల్డెన్ ఈగల్ ఇన్ఫ్రా డెవలపర్స్ పేరుతో బోగస్ రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించారు. సువర్ణ అవకాశం అంటూ రూ.10లక్షలు పెట్టి ఒక ప్లాట్ కొనండి ఏడాది తర్వాత రూ.20లక్షలు పొందండి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కొద్ది రోజుల తర్వాత అక్కడి నుంచి ఓంకార్‌నగర్‌కు మకాం మార్చి అక్కడ అద్దెకు తీసుకొని కార్పొరేట్ స్థాయిలో గౌతమ్స్ ఈగల్ ఇన్ఫ్రా డెవలపర్స్ పేరుతో కార్యాలయం ప్రాంభించారు. ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు నానక్‌నగర్‌కు చెందిన బర్ల శేఖర్‌ను ఉద్యోగిగా నియమించుకున్నారు. కస్టమర్ నుంచి వచ్చే డబ్బులో కొంత కమీషన్ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఆఫీస్ వ్యవహారాలన్నీ బొడ్డు వెంకటేశ్, బర్ల శేఖర్ చక్కబెట్టారు. ప్రజలను నమ్మించేందుకు ముందుగానే ప్లాట్ అగ్రిమెంట్ కాగితాలతోపాటు పోస్టు డేట్ చెక్కులను కస్టమర్లకు ఇచ్చారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో ఓంకార్‌నగర్‌కు చెందిన గిరిప్రసాద్ పేరుతో పాటు సదరు కంపెనీ పేరుపై భూమి ఉన్నట్లు వెంచర్ లే అవుట్ కాపీలను తయారు చేయించి మోసగించారు.

ఏజెంట్ల ద్వారా రూ.4.50 కోట్లు..

ఈ ముఠా సభ్యులు నియమించుకున్న పలువురు ఏజెంట్లు మర్రిగూడకు చెందిన సుధాకర్, చెరుకు శ్రీరాములు, బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన పచ్చిపాల గణేశ్, సురిగి రమేష్‌తో పాటు మరికొందరి ద్వారా బాధితుల నుంచి మొత్తంగా రూ.4.50 కోట్లు వసూలు చేశారు. ఆ డబ్బులో 30 శాతం ఏజెంట్ల కమీషన్ పోగా 40శాతం డబ్బుతో జల్సాలు, సినిమా షూటింగ్ కోసం ముఠా ఖర్చు చేసింది. ప్రజల్లో విశ్వాసం కోల్పోకుండా ఉండేందుకు ఆగస్టు 6న అన్నపూర్ణ స్టూడియోలో గౌతమ్‌ఈగల్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రొడక్షన్ నంబర్ వన్ పేరిట సినిమా షూటింగ్ ప్రారంభించారు. వీరిపై అనుమానంతో కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.1.36కోట్లు స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఒత్తిడి చేస్తే ఐపీ పెట్టి పారిపోయేందుకు ఈ ముఠా నిర్ణయించుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

చేవెళ్ల సభను సక్సెస్ చేయాలి

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రజాగర్జన సభాస్థలి పరిశీలన



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

చేవెళ్ల: మండలకేంద్రంలో ఈనెల 26న జరిగే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించే ప్రజాగర్జన సభా స్థలిని ఆయన బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అనంతరం నియోజకవర్గ నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన తరువాత జరుగుతున్న సభ కాబట్టి లక్షమందితో నిర్వహించాలని తలపెట్టినట్లు చెప్పారు. చేవెళ్ల సెంటిమెంట్ కూడా ఈ సభతో కలిసి వస్తుందన్నారు. జన సమీకరణపై దృష్టి సారించాలని, సభను సక్సెస్ చేయాలని సూచించారు. నియోజకవర్గం ముఖ్యనాయకులతో గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ఆయన వెంట పీసీసీ నాయకులు గౌరీసతీష్, మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయకమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు ఎస్.వసంతం, షాబాద్ దర్శన్, వెంకటస్వామి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, దేశమొళ్ల అంజనేయులు తదితరులు ఉన్నారు.

పరామర్శించేందుకు వచ్చి పరలోకాలకు..

- బైకును ఢీ కొట్టిన లారీ
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- షాద్‌నగర్ పరిధిలోని బుచ్చిగూడ బ్రిడ్జి వద్ద ఘటన



సాయి (ఫైల్)



ఆంజనేయులు (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన ఇద్దరు ప్రమాదంలో మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి షాద్‌నగర్ పరిధిలోని బుచ్చిగూడ రోడ్డులో ఉన్న బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన జింకల సాయి (21), దన్నేడు ఆంజనేయులు (30) కలిసి ద్విచక్రవాహనంపై షాద్‌నగర్‌కు వచ్చారు. జింకల సాయి బంధువు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో ఆయన షాద్‌నగర్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను పరామర్శించేందుకు వచ్చిన జింకల సాయి, దన్నేడు ఆంజనేయులు రాత్రి 8.30గంటల సమయంలో ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగు పయనం అయ్యారు. మార్గమధ్యలో షాద్‌నగర్ శివారులోని బుచ్చిగూడ రోడ్డులో బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న జింకల సాయి, దన్నేడు ఆంజనేయులు అక్కడి కక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రతాప్ లింగం, ఎస్ఐ శరత్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో మృతి చెందిన జింకల సాయి బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

ఆర్డీఓ సాయిరాం


బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

చేవెళ్ల: ఓటరు జాబితాపై బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ పి.సాయిరాం అన్నారు. చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై బూత్‌స్థాయిలో విచారణ చేయిస్తున్నట్లు చెప్పారు. ఓటరు లిస్టులో ఎవరివైనా పేర్లు డిలీట్ అయితే.. వారు మళ్లీ బూత్‌స్థాయి అధికారుల వద్ద కొత్త ఓటు నమోదు కోసం ఫారం–6 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయలన్నారు. ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో అన్ని గ్రామ పంచాయతీలలో టామ్‌టామ్ వేయించి బూత్‌స్థాయి అధికారి ద్వారా కొత్త ఓటరు నమోదుకోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. దీనికి అన్ని బూత్ లెవల్ అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ హిమబిందు, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య


లక్ష్మిని పరామర్శిస్తున్న సంధ్య తదితరులు

మీర్‌పేట: విచారణ పేరుతో గిరిజన మహిళను దారుణంగా కొట్టిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య డిమాండ్ చేశారు. ఇటీవల ఎల్‌బీనగర్ పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ గిరిజన మహిళ లక్ష్మిని మీర్‌పేట నందిహిల్స్‌లోని ఆమె నివాసంలో సంధ్య కలిసి పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విచారణ పేరుతో లక్ష్మిని పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టడం బాధాకరమని, ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రాత్రిపూట పోలీస్‌స్టేషన్లలో మహిళలను కస్టడీలో ఉంచడం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నేరమని, అయినా పోలీసులు లక్ష్మిని రాత్రి స్టేషన్‌లో ఉంచారని ఆరోపించారు. పోలీసులు, అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనూరాధ, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సరళ, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి భారతి, నాయకులు రాణి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురాం, రాష్ట్ర నాయకులు రియాజ్, నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నవీన్ తదితరులు ఉన్నారు.

ఎండుతున్న పంటలు

- నెలరోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- ఎండిపోతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో రైతన్న


తంగెళ్లపల్లి శివారులో ఎండిన మొక్కజొన్న పంట

కొందుర్గు: ఓవైపు అతివృష్టి.. మరోవైపు అనావృష్టి.. ఇలా ప్రకృతి రైతన్నలపై కన్నెర చేసింది. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే నెలరోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్నిరోజులపాటు వర్షాలు తెరిపినివ్వడంతో ఊరట పడితే వరుసగా నెల రోజులపాటు వర్షాలు లేక మరోసారి పంటలు దెబ్బతినడంతో రైతన్నలు విలవిలలాడుతున్నారు. జిల్లాలోని కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, తలకొండపల్లి, షాబాద్ మండలాల్లో మెజార్టీ ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో అధికంగా పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయపంటలు సాగుచేస్తారు.

వర్షాధార పంటలే ఎక్కువ..

ఈ ప్రాంతంలో అధికంగా ఎర్రనేలలు ఉన్నాయి. దీంతో వర్షాధార పంటలే ఎక్కువగా పండుతాయి. వారానికో, పది రోజులకో ఓ వర్షం కురిస్తే పంటలు ఏపుగా పెరిగి రైతులు ఆశించిన దిగుబడి లభిస్తుంది. ఈ ఏడాది దాదాపు 50వేల ఎకరాల్లో మొక్కజొన్న, 55వేల ఎకరాల్లో పత్తి, 20వేల ఎకరాల్లో వరి, 10వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగుచేశారు.అయితే ఈ ఏడాది పునాస పంటల సాగు కోసం విత్తనాలు నాటిన ఆరంభంలోనే జూలైలో వరుసగా దాదాపు నెలరోజులపాటు వర్షాలు కురియడంతో పంటపొలాల్లో కలుపు మొక్కలు పెరిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక ఆగస్టులో కాస్త వర్షాలు తగ్గడంతో రైతులు పంటపొలాల్లో నుంచి కలుపుమొక్కలు తొలగించి, భూములను చదును చేసుకున్నారు. పంటలకు అవసరమైన రసాయనిక ఎరువులు వేశారు. అయితే ప్రస్తుతం దాదాపు నెలరోజులు కావస్తున్నా వర్షాలు కురియకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు కళ్లముందే ఎండిపోవడం చేసి రైతన్నలు కంట నీరు పెడుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. వర్షాలు లేక పంట పూర్తిగా దెబ్బతింది. ఏమి చేయాలో తెలియని పరిస్థితి. పంటల పెట్టుబడి కోసం దొరికిన చోట అప్పులు చేశాం. అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కుమ్మరి అంజయ్య, ఉత్తరాసిపల్లి

పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి



2.5 ఎకరాల్లో పత్తి, 2–5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న పంట ఇప్పుడు వర్షం వచ్చినా తేరుకోదు. ఈ సమయంలో వర్షం కురిస్తే పత్తిపంట పెట్టుబడి అయినా రావచ్చు.

– వెంకటేశ్వర్ రెడ్డి, రైతు, ఉత్తరాసిపల్లి

బావిలో పడి బాలుడి మృతి


చంద్రకాంత్ మృతదేహాన్ని వెలికితీస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: వ్యవసాయ పొలం వద్ద బావిలో పడి ప్రమాదవశాత్తు బాలుడు మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం ఉదయం చోటు చేసుకొంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అంరాధికుర్దు గ్రామానికి చెందిన మునిగే అనిత.. కుమారుడు చంద్రకాంత్(15) సమీపంలోని కోల్కుంద ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదవుతున్నాడు. తండ్రి నర్సింహులు ఇదివరకే మృతి చెందాడు. తల్లి అనిత బుధవారం పత్తికి మందు పిచికారీ చేసేందుకు పొలానికి వెళ్తుండగా ఆమెతో పాటు చంద్రకాంత్ కూడా వెళ్లాడు. పొలం పనుల్లో భాగంగా చంద్రకాంత్ నీళ్లు తీసుకువచ్చేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశత్తు కాలిజారి పడిపోయాడు. ఈతరాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. కూమారుడు ఎంతకూ రాకపోయేసరికి చుట్టుపక్కల గాలించగా బావిలో కొడుకు విగతజీవిగా పడిఉన్నాడు. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శవ పంచానామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడి

మొయినాబాద్ రూరల్: సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ రాంగోపాల్‌వర్మ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కిరణ్‌బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో పంటల సాగును పరిశీలించారు. నేల సారవంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించినప్పుడే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వరిలో కాండంతొలుచు పురుగును ఎలా అరికట్టవచ్చో అవగాహన కల్పించారు. పంటలకు ఎలాంటి మందులు వాడాలి అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. మట్టి నమూనాలను బట్టి ఎరువులను వాడినట్లయితే రైతులకు పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని సూచించారు. పంట వేసే ముందు క్షేత్ర ప్రదర్శన చేసి చూసుకుంటే ఎంతో బాగుంటుందన్నారు. సాగులో పెట్టుబడి తగ్గించేందుకు అనేక ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీజయ, మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, యాదయ్య


ఆమనగల్లు: దివ్యాంగులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆలేటి నారాయణసాగర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన దివ్యాంగుల పింఛన్ పెంపు ఉత్తర్వులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ లబ్ధిదారులకు అందించారు. ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, ఆమనగల్లు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, ఎంపీటీసీలు కుమార్, సరిత పంతునాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి..

చేవెళ్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు ఈనెల నుంచి రూ.4016 పింఛన్ అందిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల ఎంపీడీ కార్యాలయం వద్ద బుధవారం చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన దివ్యాంగుల పింఛన్ డబ్బులు, పెంచిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. దివ్యాంగులను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. జెడ్పీటీసీ మాలతి, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు మిట్ట వెంకటరంగారెడ్డి, పాపరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీఓలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేశంపేటలో ఒడిశా బృందం


మహిళా సమాఖ్య సభ్యులతో ఒడిశా బృందం

కేశంపేట: ఒడిశాకు చెందిన ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ)లో శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మండల మహిళా సమాఖ్య సభ్యులతో బుధవారం సమావేశమయ్యారు. మహిళా సమాఖ్య ద్వారా అమలుచేస్తున్న పథకాల గురించి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. అనంతరం కస్టమర్ హైరింగ్ సెంటర్, భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సంఘం పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగామ్ కోఆర్డినేటర్ ప్రదీప్‌గౌడ్, రీసెర్చ్ అధికారి నిస్సి జాన్, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు శేఖర్, నర్సింహ, ఏపీఎంలు భగవంతు, శిరీష, విజయ, చంద్రకళ, సుగుణమ్మ, గీత, గిరి,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహిస్తాం

ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్


ఇబ్రహీంపట్నం: బీసీ బంధు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి


షాద్‌నగర్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో మొదటి విడతలో బీసీ బంధు కింద ఎంపికైన 300 మంది లబ్ధిదారులకు బుధవారం ఇబ్రహీంపట్నం శాస్త్రా గార్డెన్‌లో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలు స్వశక్తితో ఎదిగేందుకు బీసీ బంధు కింద రూ.లక్ష సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా కులవృత్తులను ప్రోత్సహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో నాలుగైదు సంవత్సరాల్లో సుమారు రూ.3వేల కోట్ల మేర అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ విమలాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, బీఆర్ఎస్ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో కులవృత్తులకు గుర్తింపు..

షాద్‌నగర్: కులవృత్తుల వారికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వం బీసీ బంధు పథకం కింద నియోజకవర్గంలో 294 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున మంజూరు చేసింది. బుధవారం పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఇందుకుగాను బీసీబంధు, మైనార్టీ బంధు పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజా వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, ఎమ్మె శ్రీలత, నారాయణరెడ్డి, కమిషనర్ వెంకన్న, తహసీల్దార్లు, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ మధుబాబు బదిలీ

ఇబ్రహీంపట్నం: సుదీర్ఘకాలంగా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పి.మధుబాబును చంపాపేట్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సుమారు 7 సంవత్సరాల పాటు ఇక్కడ మధుబాబు విధులను నిర్వర్తించారు. ఆయన స్థానంలో జిల్లా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సంధ్యారాణి సబ్‌రిజిస్ట్రార్‌గా ఇక్కడికి వస్తున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మధుబాబును సన్మానించారు.

మద్యానికి బానిసై..

- ఇంటినుంచి వెళ్లిపోయిన వ్యక్తి
- గ్రామశివారులోని కుంటలో శవమై తేలిన వైనం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొందుర్గు: ఇంటినుంచి వెళ్లిపోయిన వ్యక్తి కుంటలో శవమై కనిపించిన సంఘటన కొందుర్గు మండలంలోని కొత్త ఆగిర్యాలలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగం మల్లేష్(37) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకి కోసం ఎంత వెతికినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో కొత్త ఆగిర్యాలలో శివారులోని సంఘనాథ్ కుంటవద్ద బుధవారం స్థానికులకు బైక్, చెప్పులు కనిపించాయి. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుంటలో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక..

- ఉరివేసుకుని నవవధువు ఆత్మహత్య
- గొల్లూరులో విషాదం

మహేశ్వరం: భర్త వేధింపులు భరించలేక నవవధువు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని గొల్లూరులో బుధవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బొప్పారం సాయిలు కూతురు అనూష(22)ను అదే గ్రామానికి చెందిన పెద్దిగారి మల్లయ్య చిన్నకుమారుడు యోగేష్‌కి ఇచ్చి మే–2023లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో ఒప్పుకున్న బంగారం, వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులను కట్నకానుల కింద అప్పగించారు. మహేశ్వరం మండలం గొల్లూరు గ్రామంలో రామరావు తోటలో యోగేష్ కూలీ పనులు చేస్తుండేవాడు. వివాహం అనంతరం భార్య అనూషపై యోగేష్ అనుమానంతో వేధించసాగాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ సమక్షంలో పంచాయతీ పెట్టి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కొన్నిరోజులు దంపతులు ఇద్దరూ బాగేనే ఉంటున్నారు. ఈనెల 20న గొల్లూరులో పనిచేసే తోటకు భార్యను తీసుకొచ్చాడు యోగేష్. ఈ క్రమంలో బుధవారం(23న) ఉదయం 7:30 నిమిషాలకు అనూష.. తన తల్లికి ఫోన్ చేసి భర్త యోగేష్ కొట్టి వేధిస్తున్నాడని చెప్పింది. ఉదయం 8:30 గంటల సమయంలో తోటలో ఉండే గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అదే తోటలో పనిచేసే మృతురాలి బంధువు సంధ్య గదిలోకి వెళ్లి చూడగా అనూష ఉరివేసుకొని ఉంది. వెంటనే మహేశ్వరం పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిచారు. తన కూతురు అనూషను అల్లుడు యోగేష్ ఉరివేసి చంపినట్లు అనుమానం ఉందని పోలీసులకు మృతురాలి తండ్రి సాయిలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నర్సింహా తెలిపారు.